# 4. త్యాగం

(ఉపవాచకం)



పూర్వం గంగానదీ తీరంలో 'ధర్మపురం' అనే గ్రామం ఉండేది. ఆ దేశపు రాజైన విక్రమార్కుడు దేశసంచారం చేస్తూ ఒకరోజు ఆ గ్రామం చేరుకొన్నాడు. గంగానదిలో స్నానంచేసి అక్కడి దేవతలను పూజించాడు. ఆ నదీతీరంలో ఒకచోట ఒక పండితుడు పురాణం చెపుతూంటే వింటూ కూర్చున్నాడు. ఇంతలో అక్కడికి ఒక స్త్రీ భోరున ఏడుస్తూ వచ్చింది. "నదిలో స్నానం చేస్తున్న నా భర్తను మొసలి పట్టుకొని నీటిలోకి లాక్కుపోతోంది. ఎవరైనా తొందరగా వచ్చి రక్షించండి, రక్షించండి'! అంటూ కేకలు వేసింది. అప్పుడు సాహసవంతుడైన విక్రమార్కుడు నీటిలోకి దూకి, మొసలిని చంపి, అతన్ని కాపాడాడు.

అతడు విక్రమార్కుడికి నమస్కరించాడు. "అయ్యా! నువ్వు చాలా సాహసవంతుడవు, పరోపకార గుణం గలవాడివి. కనకనే నన్ను రక్షించావు. నేను నిరుపేదను, కృతజ్ఞతలు తెలపడం కంటే, నీకేమి ప్రత్యుపకారం చేయగలను?" అన్నాడు.

అప్పుడు విక్రమార్కుడు, "మీరు చింతించకండి, నేను ఏ ప్రత్యుపకారాన్నీ మీనుంచి కోరటంలేదు," అన్నాడు. అప్పుడతడు ఏదో గుర్తుకు వచ్చినట్లుగా, వెంటనే "అయ్యా! జ్ఞాపకం వచ్చింది. నా దగ్గర ఒక మంత్రముంది. దాన్ని జపిస్తే, చేసిన పాపాలన్నీ తొలగిపోతాయి. అంతేకాదు, జపించినవారు కోరుకున్నప్పుడు దేవలోకంనుంచి విమానం వచ్చి వారిని తీసుకువెళ్తుంది. దాన్ని ఇంకొకరికి ఉపదేశిస్తే మాత్రం, ఆ ఉపదేశించిన మొదటివారికి ఆ మంత్రం, ఆ తరవాత పనిచేయదు. ఆ మంత్రాన్ని మీకు ఉపదేశిస్తాను. ఈపాటి మేలయినా మీకు చేసే అవకాశమియ్యండి" అంటూ ఆ మంత్రం రాజుకు ఉపదేశించి, భార్యతో తన దారిన తాను వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత విక్రమార్కుడు దేశసంచారం చేస్తూ, వింధ్యపర్వత ప్రాంతానికి చేరుకొన్నాడు. అక్కడ పాడుపడిన దేవాలయం ముందున్న చెట్టుమీద ఒక రాక్షసుడు కనిపించాడు.

రాజు ఆ రాక్షసుడితో – "నువ్వు ఎవరివి? ఎందుకిక్కడ ఉన్నావు?" అని అడిగాడు. అప్పుడా రాక్షసుడిలా అన్నాడు. "అయ్యా! నేను ఇంతకుముందు మాళవదేశపురాజు దగ్గర పురోహితుడిగా ఉండేవాణ్ణి. మా రాజుకు పండితులను గౌరవించడమంటే చాలా ఇష్టం. వచ్చిన పండితులను పరీక్షించమని రాజు నన్ను నియమించాడు. నేను చెప్పిన పండితులకే బహుమతులిచ్చేవాడు మా రాజు. నాకు రాజాస్థానంలో లభించిన గౌరవానికి పొంగిపోయేవాణ్ణి.

కొంత కాలానికి, "నేనే గొప్ప పరీక్షకుణ్ణి" అనే గర్వం నాలో పెరిగిపోయింది. ఎంతటి పండితుడినైనా చులకనగా చూసేవాణ్ణి. ఒకరోజున గొప్ప గొప్ప శాస్త్రాలు చదువుకొన్న ఒక మహాపండితుడు రాజుగారి సభకు వచ్చాడు. "తనను పరీక్షించి, తగిన బహుమానమిప్పించ"మని నన్ను కోరాడు. నేను, గర్వంతో, "ఇతడు సామాన్య పండితుడే" అని గేలిచేశాను. అందుకు ఆ పండితుడు కోపగించి "నన్ను పరీక్షించి నా శక్తి గ్రహించక ఇలా నన్నవమానపరిచావు. కనక బ్రహ్మరాక్షసుడివై పుట్టు" అని శపించాడు. నేను భయంతో వణుకుతూ, 'శాపవిమోచనం' అనుగ్రహించమని కోరాను.

అప్పుడు, ఆ పండితుడిట్లా అన్నాడు: "వింధ్యపర్వతం దగ్గర పాడుబడ్డ గుడి ఒకటి ఉంటుంది. దాని కెదురుగా ఉండే రావిచెట్టుమీద నువ్వు రాక్షసుడిగా ఉండు. కొన్నాళ్ళకు దేశసంచారంచేస్తూ, విక్రమార్కుడు అనే రాజు అక్కడికి వస్తాడు. అతని వల్ల నీకు ఈ శాపం తొలగిపోతుంది."



© SCERT not to be republished

"అప్పటి నుండి నీ కోసం ఎదురుచూస్తూ, ఈ చెట్టు మీదనే గడుపుతున్నాను. నేటికి నా అదృష్టం పండింది. నీ దర్శనమైంది. ఒకరోజు నువ్వు గంగానదిలో మొసలిని చంపి, ఒక వ్యక్తిని రక్షించావుకదా! ఆ పుణ్యఫలాన్ని నాకు ధారపోస్తే నాకీ శాపం తప్పుతుంది" అని ప్రార్థించాడు.

విక్రమార్కుడు ఒక్కక్షణమైనా ఆలోచించలేదు. రాక్షసుడు కోరినట్లే చేశాడు. వెంటనే ఆ రాక్షసుడు మునుపటి రూపం పొంది, రాజును ఆశీర్వదించాడు. మంత్రమహిమవల్ల దేవలోకంనుంచి వచ్చిన విమానమెక్కి ఆకాశమార్గాన వెళ్ళిపోయాడు.

అక్కడినుంచి బయలుదేరిన విక్రమార్కుడు దేశమంతటా తిరుగుతూ పోతున్నాడు. అతనికి ఒకచోట నలుగురు సిద్ధులు కనిపించారు. రాజు వాళ్ళ దగ్గరకు వెళ్ళాడు. వినయంగా నమస్కరించాడు. వాళ్ళ యోగక్షేమాలను విచారించి, "అయ్యా! మీరు ఏయే దేశాలు తిరిగారు? ఏ వింతలు చూశారు?" అని అడిగాడు.

"మేము చాలా దేశాలు తిరిగాం. అనేక క్షేత్రాలను దర్శించుకున్నాం. పుణ్యతీర్థాలలో స్నానాలు చేశాం. కాని, హిమాలయపర్వతాలలో అద్భుతశక్తులు కలిగిన శ్రీదత్తుడు అనే మహర్షిని మాత్రం చూడలేకపోయాము" అని చెప్పారు. వాళ్ళ నిరాశను గమనించాడు రాజు. "ఇన్ని చూసిన మీరు, ఆ మహామునిని ఎందుకు చూడలేకపోయారు?" అని అడిగాడు.

"ఆ ప్రదేశంలో పాములు ఎక్కువగా తిరుగుతూంటాయి. అక్కడకు పోతే ఆ పాములు మనుష్యుల్ని అడుగుతీసి అడుగు ముందుకు వెయ్యనివ్వవు. ఆ మార్గంలో ప్రయాణించటం ఎంతో అపాయకరం. అందుకే, అటు వెళ్ళే ప్రయత్నం మానుకొన్నాం," అని చెప్పారు ఆ సిద్ధులు. విక్రమార్కుడు ఆ నలుగురు సిద్ధులను తీసుకొని హిమాలయాలకు ప్రయాణమయ్యాడు.

దారిలో పెద్దవీ, పొడవైనవీ, విషమున్నవీ, విషంలేనివీ రంగు రంగుల పాములు ఉన్నాయి. ఆ దారిలో పాములమధ్యనే నడుస్తున్నాడు. తనకు, సిద్ధులకూ చుట్టుకొన్న పాములను హింసించకుండా జాగ్రత్తగా పక్కకు తప్పిస్తూ ముందుకు సాగుతున్నాడు. అడ్డువచ్చిన మంచుగడ్డలను తొలగిస్తూ పోతూ చివరికి శ్రీదత్తుని ఆశ్రమం చేరుకున్నాడు. తనతోపాటు సిద్ధులకు కూడా శ్రీదత్తుని దర్శనభాగ్యం కలిగించాడు. సిద్ధులు విక్రమార్కుడి పరాక్రమాన్ని గురించి కష్టసుఖాలను తెలుసుకోడానికి చేస్తున్న దేశసంచారాన్ని గురించి శ్రీదత్తునికి వివరించారు.

సంతోషించిన ఆ మునీంద్రుడు కోరుకొన్నప్పుడు ఎక్కడికైనా తీసుకెళ్ళగలిగే 'మాయా తివాచీ'ని విక్రమార్కునికి ప్రసాదించాడు. తమకు శ్రీదత్తుని దర్శనం కల్పించిన విక్రమార్కుడికి సిద్ధులు నలుగురూ ఒక బలపం, కొరడా, మంత్ర దండం, బొంత కానుకలుగా ఇచ్చారు. ఏ ప్రాణి బొమ్మనైనా ఆ బలపంతో రాసి, కొరడాతో తాకిస్తే దానికి ప్రాణం వస్తుంది. మంత్రాన్ని జపిస్తే శత్రునాశనం జరుగుతుంది. బొంతను విదిలిస్తే కావలసినంత ధనం లభిస్తుందని ఆశీర్వదించారు.

రాజు మళ్ళీ దేశాటనం చేస్తూండగా ఒకడు కట్టెలు కొడుతూ కనిపించాడు. "పచ్చని అడవిని ఎందుకు పాడు చేస్తున్నావు" అని అడిగాడు రాజు. అందుకతడు "మహారాజా! నేనొక రాజుకు స్నేహితుణ్ణి. అతడు యుద్ధంలో ఓడిపోయాడు. రాజ్యం శత్రువుల పాలయింది. ఆ రాజు నన్ను తీసుకొని అడవికి వచ్చాడు. జీవించడం వ్యర్థమని అగ్నిప్రవేశం చేయాలనుకొన్నాడు. కట్టెలకోసం నన్ను పంపించాడు" అన్నాడు.

విక్రమార్కుడు అతనితో కలిసి రాజును చేరుకొన్నాడు. "మహారాజా! రాజులు శత్రువులను సాధించాలి, లోకరక్షణకు నడుం బిగించాలి. కానీ వెన్ను చూపకూడదు. ఇవిగో ఈ వస్తువులు తీసుకో అంటూ శ్రీదత్తుడు, సిద్ధులు తనకు ప్రసాదించిన వస్తువులను, అద్భుత శక్తులను అతనికి దానం చేశాడు. రాజకుమారుడు మాయా తివాచీతో తన రాజ్యానికి చేరుకున్నాడు. చేతిలోని బలపంతో చతురంగ బలాలను గీయించాడు. కొరడాతో తాకించగా అతని బలగమంతా బతికింది. బొంత విదిలించగానే ధనరాశులు కురిశాయి. శత్రువినాశిని మంత్రం జపించి యుద్ధానికి వెళ్ళాడు. శత్రువును జయించి మళ్లీ రాజ్యాన్ని పొందాడు. ప్రజలకు సుఖశాంతులను చేకూర్చాడు.

ఇలా ఇతరులకోసం ఎన్నో త్యాగాలు చేసిన విక్రమార్కుడు త్యాగధనుడుగా కీర్తిప్రతిష్ఠలు పొందాడు.

మూలం : **విక్రమార్కుని కథలు**

© SCERT not to be republished

**ప్రశ్నలు :**

1. ఈ కథలో ఏ విషయాలు మీకు అద్భుతంగా అనిపించాయి? ఎందుకో తెలపండి.
2. ఈ పాఠంలో ఎన్ని పాత్రలున్నాయి? వాటి స్వభావాలను రాయండి.
3. ఈ పాఠానికి మరొక శీర్షికను నిర్ణయించండి. ఆ శీర్షికను ఎందుకు ఎన్నుకొన్నారో చెప్పండి.
4. ఈ పాఠంలో విక్రమార్కుడి త్యాగగుణాన్ని తెలిపే రెండు సంఘటనలున్నాయి. వాటిని రాయండి.
5. విక్రమార్కుడు ధైర్యవంతుడు, సాహసవంతుడు. అతని స్థానంలో మీరుంటే ఏం చేసేవారు?
6. ఈ కథలను గురించి మీ మిత్రులతో చర్చించండి. ఈ పాఠంమీద చిన్నచిన్న ప్రశ్నలు – జవాబులు తయారుచేయండి.
7. కొన్ని "విక్రమార్క కథలు" సేకరించి చదవండి, తరగతి గదిలో గోడలమీద ప్రదర్శించండి. (చందమామ, బాలమిత్ర పత్రికలను పరిశీలించండి)

**"త్యాగం, సేవ - ఇవే భారతీయులకు మహోత్తమ ఆదర్శాలు" - స్వామి వివేకానంద**